క్లుప్తంగా

కరపత్రాలు విడుదల



గద్వాల అర్బన్: భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం సమాన అవకాశాల సాధనకు ఐక్యంగా కలుద్దాం అనే అంశంపై గురువారం జిల్లా కేంద్రంలోని టీజేఎస్ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్‌గౌడ్ మాట్లాడారు. 2014పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. మోదీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని గుజరాత్‌ని అభివృద్ధి చేశారు తప్ప తెలంగాణ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని, నేటికి తెలంగాణ విభజన వాగ్దానాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు అండగా నిలువాలని, ఇండియా కూటమితో ఏర్పడిన కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో టీజేఎస్ నాయకులు రామ్మోహన్, వీరభద్రప్ప, మహబూబ్‌పాష, మధు, ఇస్మాయిల్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, చెట్లను తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరాఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ గద్వాల టౌన్ ఏఈ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5:30 గంటల నుంచి 6 గంటల వరకు గద్వాల పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డు, రాధాకృష్ణ కాలనీ, బీరెల్లి చౌరస్తా, వేణు కాలనీ, టీచర్స్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి, రైల్వేస్టేషన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



ఎర్రవల్లిచౌరస్తా: యువత మాదక ద్రవ్యాల బారిన పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోదండాపురం ఎస్ఐ స్వాతి అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని సాసనూలు గ్రామంలో ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, విక్రయాలపై పోలీసులు తీసుకునే కఠిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఎక్కడైనా మత్తుపదార్థాల ఉత్పత్తి, రవాణా, విక్రయాలు జరిగితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

ధరూరు: ప్రస్తుత తరుణంలో యువత మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని ఎస్ఐ విజయ్ కుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని పెద్దపాడులో సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, కల్తీ కల్లు, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై వివరించారు. మత్తుకు అలవాటు పడటం వల్ల మెంటల్‌గా, ఫిజికల్‌గా, ఫిట్‌నెస్‌ను కోల్పోయి అనారోగ్యం బారిన పడటమే కాకుండా తాము ఏమి చేస్తున్నామో కూడా తెలియని స్థితిలోకి వెళ్లి ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతారన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిషేధానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చట్ట విరుద్ధమైన పనులు చేసే వారిని ఉపేక్షించేది లేదన్నీ, అలాంటి వారు ఉంటే మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్‌తో రూపొందించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్

- సొంత పనులకు వాడకుండా చెక్..
- ఇతర పనుల వినియోగానికి అడ్డుకట్ట
- జీపీలకు ఆర్థికభారమంటున్న ప్రజాప్రతినిధులు
- నియోజకవర్గంలో 124 ట్రాక్టర్లు



కొండేరు దగ్గర హరితహారం చెట్లకు నీరు పోస్తున్న జీపీ ట్రాక్టర్

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను ప్రజాప్రతినిధులు ఇకపై తమ సొంత పనులకు వాడుకోకుండా చెక్ పడనుంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు ప్రభుత్వం జీపీఎస్ విధానం అనుసంధానం చేసింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కసరత్తును చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో చెత్త సేకరణ, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోయడం కోసం ప్రతి జీపీకి ఒక ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్లను కొనుగోలు చేయడం కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసిన విషయం అందరికి తెలిసిందే. దీనిలో భాగంగా 500 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో 15 హెచ్‌పీ మినీ ట్రాక్టర్లు, 500 నుంచి 3వేల లోపు జనాభా ఉన్న గ్రామాలకు 20, 21 హెచ్‌పీ ట్రాక్టర్లు, 3వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాలకు 39, 40, 42 హెచ్‌పీ సామర్థ్యం గల ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చింది. దీంతో చాలా జీపీలు ట్రాక్టర్లను కొనుగోలు చేసి జీపీలలోని వివిధ పనులకు వినియోగిస్తున్నారు. వాటిని గ్రామ పంచాయతీల అవసరాలతో పాటు పాలక వర్గాలు తమ సొంత అవసరాలకు సైతం ఉపయోగిస్తున్నాయి. దీంతో నిత్యం ప్రతిపక్ష నాయకులు, ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దానికి అడ్డుకట్ట వేయడానికి జిల్లా ఉన్నతాధికారులు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)ను ట్రాక్టర్ ఇంజన్లకు అనుసంధానం చేస్తున్నారు.

జీపీఎస్ ఎలా పనిచేస్తుంది..

జీపీఎస్‌ను ట్రాక్టర్‌కు అమర్చితే ట్రాక్టర్ స్టార్ట్ కాగానే జీపీఎస్ పనిచేయడం మొదలవుతుంది.



కోదండాపురం జీపీ



గార్లపాడు జీపీ

దీంతో గ్రామ పరిధిలోని రోజు వారి విధుల్లో భాగంగా ఆ ట్రాక్టర్ ఎక్కడికి వెళ్తుంది, ఎక్కడ ఎంతసేపు ఉందనేది అందులో నిక్షిప్తం అవుతుంది. ట్రాక్టర్ పంచాయతీ పరిధిలోనే ఉందా.. లేదా ఇతర అవసరాల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిందా అనేది జీపీఎస్ సిస్టం ద్వారా ఈజీగా తెలుసుకోవచ్చు. తద్వారా జీపీ ట్రాక్టర్‌ను పాలక వర్గాలు తమ సొంత అవసరాలకు వాడకుండా ఇలా అడ్డుకట్ట వేయవచ్చు.

జీపీలపై ఆర్థిక భారం..

నియోజకవర్గంలో మొత్తం 124 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో చాలా జీపీలు ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులతో నిత్యం సతమతమవుతున్నాయి. ప్రస్తుతం ట్రాక్టర్‌కు జీపీఎస్ అనుసంధానం చేస్తే రూ.3,600 చెల్లించాల్సి వస్తుంది. మెయింటెనెన్స్ ఖర్చుల కింద ప్రతి నెల అదనంగా రూ.300 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆదాయ వనరులు లేని చిన్న చిన్న జీపీలకు దీని వల్ల మరింత ఆర్థికభారం పడనుంది.

నియోజకవర్గంలో 124 ట్రాక్టర్లు..

అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 124 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీనిలో భాగంగా 124 పంచాయతీల్లో కూడా గతంలో ప్రభుత్వం ట్రాక్టర్లను కొనుగోలు చేయించింది. ఇప్పటికే వీటన్నింటికి కూడా జీపీ పేరిట రిజిస్ట్రేషన్లు చేయడం పూర్తయ్యాయి. ప్రస్తుతం 74 ట్రాక్టర్లకు ఇప్పటికే జీపీఎస్‌ను అనుసంధానం చేశారు. మిగిలిన 50 ట్రాక్టర్లకు కూడా త్వరలోనే జీపీఎస్‌ను అనుసంధానం చేయిస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం..



పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతి జీపీకు ప్రభుత్వం ట్రాక్టరును కొనుగోలు చేయించింది. దీనిలో భాగంగా పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్‌ను అనుసంధానం చేయాలని ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. పాలకులు తమ సొంత అవసరాలకు కూడా జీపీ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారని, నిత్యం ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి. దీనిలో భాగంగా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం ప్రతి టాక్టర్‌కు జీపీఎస్ విధానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో మండలంలోని 29 ట్రాక్టర్లలో 10 ట్రాక్టర్‌లకు ఇప్పటికే జీపీఎస్ అనుసందానం చేశాం. మిగిలిన ట్రాక్టర్లకు త్వరలోనే జీపీఎస్ ఏర్పాటు చేయిస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

ఆయా మండలాల వారీగా ట్రాక్టర్ల వివరాలు..

మండలం	జీపీలు	జీపీఎస్ ఉన్నవి	మొత్తం ట్రాక్టర్లు
ఇటిక్యాల	29	10	29
మానవపాడు	16	14	16
ఉండవెల్లి	16	10	16
అలంపూర్	14	07	14
వడ్డేపల్లి	10	10	10
రాజోళి	11	09	11
అయిజ	28	14	28

మద్యం బాబుల అడ్డాగా సబ్‌స్టేషన్



పచ్చర్లలో మద్యం బాబులకు అడ్డాగా మారిన సబ్ స్టేషన్ కార్యాలయం

రాజోళి: మండలంలోని పచ్చర్లలో నిర్మాణం నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ మద్యం బాబులకు అడ్డాగా మారింది. నిర్మాణం మధ్యలో నిలిచిపోగా, అందులో మద్యం బాబులు మందు తాగేందుకు వెళ్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అక్కడే విద్యుత్, ఇతర విలువైన పరికరాలు ఉండగా, కార్యాలయం కోసం నిర్మిస్తున్న భవనాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ పరికరాలు అపహరణకు గురయ్యే అవకాశముందని, వాటిని కనీసం భద్రపరచకుండా వదిలేశారని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు అటు వైపు పరిశీలించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

అలంపూర్‌రూరల్: మండలంలోని క్యాతూరులో గురువారం కబడ్డీ పోటీలను అలంపూర్ కోర్టు ఏజీపీ నరసింహ ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

బ్రిడ్జి పనులు పూర్తిచేయించండి

అయిజ: అయిజ–గద్వాల ప్రధాన రహదారిలో వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తిచేయించి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బ్రిడ్జి పనులు పూర్తి కానందున అయిజలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్సీకి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్సీ ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం



సమావేశానికి హాజరైన అఖిలపక్షం నాయకులు

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్య వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను వెంటనే పూర్తిచేసి బ్రిడ్జిని ప్రారంభించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని అఖిల పక్షం కమిటీ నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ భవనంలో అఖిలపక్ష కమిటీ నాయకులు సమావేశమయ్యారు. సమావేశానికి వివిధ పార్టీల, సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేయకుంటే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, రైతు సంఘాల నాయకులు ఏకమై ప్రభుత్వంపై పోరాటం చేయాలని, అవసరమైతే నిరాహార దీక్ష చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వానికి సమయం ఇచ్చి అనంతరం ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఎన్సీడీ పోర్టల్లో లింక్ చేయండి



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు

అయిజ: పీహెచ్‌సీ సిబ్బంది నిబంధనల మేరకు పనిచేసే వివరాలు ఎన్సీడీ పోర్టల్లో లింక్ చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.రాజు అన్నారు. గురువారం పట్టణంలోని పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ హేమ మానస ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీ స్టాఫ్‌కు, సూపర్‌వైజర్ క్యాడర్‌కు ఎన్సీడీపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్స్ క్రియేషన్, లింకింగ్‌కు సంబంధించిన వివరాలను ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎన్సీడీని నిర్వహించడంతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులు లింక్ చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎన్సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, ఎంపీహెచ్‌ఓలు ఓబులేష్, పర్వతాలు, సూపర్‌వైజర్లు శోభరాణి, పీహెచ్‌సీ సిబ్బంది, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



బోరవెల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎర్రవల్లిచౌరస్తా: కోదండాపురం పీఎస్ పరిధిలోని బోరవెల్లిలో ఎస్ఐ స్వాతి ఆధ్వర్యంలో గురువారం కేంద్ర సాయుధ బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో కలిసి ఐటీబీఎఫ్ జవాన్లు గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఓటర్లకు ఎన్నికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వాతి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికీ భయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి ఓటు వేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐటీబీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు ఒకపూట సెలవు ఇవ్వాలని వినతి



గద్వాల అర్బన్: జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఒక పూట సెలవు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ పట్టణ అధ్యక్షుడు రాజేష్, తదితరులు ఉన్నారు.

ప్రజలను మోసం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలను మోసం చేసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తమ ఓటుతో గుణపాఠం చెప్పాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల, వావిలాల, ఉదండాపురం గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటి వరకు వాటిని మరిచిందన్నారు. మన హక్కులను కాపాడుకునేందుకు భారత రాజ్యాంగమే ఏకైక ఎజెండాగా పనిచేస్తున్న బీఎస్పీకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

9 లీటర్ల మద్యం పట్టివేత

ఉండవెల్లి: తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద అధికారుల తనిఖీలో 9లీటర్ల మద్యం పోలీసులు పట్టుకున్నారు. కర్నూల్ జిల్లా మామిదలపాడుకు చెందిన మద్దయ్య మద్యం దుకాణం నుంచి 9 లీటర్ల అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ శ్రీనివాసులు పట్టుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

షాపింగ్ కాంప్లెక్స్ అద్దెకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న పీఏసీఎస్ ప్రసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్

అయిజ: సింగిల్ విండోకు సంబంధించిన 16 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌కు గురువారం పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్ బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో పాల్గొనేందుకు వ్యాపారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేలానికి వచ్చిన 35 మంది ఒక్కొక్కరు రూ.25 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ప్రసిడెంట్ మాట్లాడారు. గతంలో మొత్తం 16 దుకాణాలకు ప్రతినెల రూ.40 వేలు అద్దె వస్తుండగా ఇప్పుడు నిర్వహించిన వేలంలో ప్రతి నెల రూ. 1,21,200 వస్తున్నట్లు తెలిపారు. వేలంలో నాలుగు షాపులకు సరైన అద్దె పలుకక పోవడంతో మరొకసారి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం షాపులకు అడ్వాన్స్ రూ.7,85,000 చెల్లించారని, వాటిని డీసీసీబీ బ్యాంక్‌లో జమచేస్తామని, దుకాణాల కిరాయి గడువు పూర్తయిన వెంటనే వారికి తిరిగి చెల్లిస్తామని తెలిపారు. వస్తున్న ఆదాయాన్ని సొసైటీ అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నట్లు పీఏసీఎస్ ప్రసిడెంట్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి మల్లేష్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మల్లు రవికి మద్దతుగా ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీదొడ్డి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు గురువారం కేటీదొడ్డి మండలంలోని ఈర్లపాడులోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి గడపగడప తిరిగి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఐదు గ్యారంటీల గురించి ప్రజలకు వివరిస్తూ గత ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందో ఒకసారి ఆలోచించాలన్నారు. రానున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవికి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు గుంతబాయి శ్రీనివాసులు, సింగల్‌విండో డైరెక్టర్ సురేష్, సీనియర్ నాయకులు ఉన్నారు.

ఇంటింటి ప్రచారంలో బీజేపీ

మానవపాడు: రైతులకోసం ఎరువుల సబ్సిడీ ఇస్తుందని కిసాన్ సమ్మాన్ నిధికింద రైతులకు ఆర్థికసాయం అందిస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బోరవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బలరాంరెడ్డి, జిల్లా కిషాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మాణిక్యరెడ్డి, భూత్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, మాజీ సర్పంచ్ కొండన్న తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన ప్రపంచానికి ఆదర్శం

శాంతినగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన ప్రపంచానికే ఆదర్శమని బీజేపీ నాయకులు సురేష్, నరేష్‌లు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని జమ్ములమడుగు 173, 174 బూత్‌లలో అధ్యక్షులు సురేష్, నరేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరువర్గాల వాగ్వాదం

గద్వాల క్రైం: రెండు విభిన్నమైన జెండాల కోసం రెండువర్గాల మధ్య గురువారం మధ్యాహ్నం తీవ్ర స్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జమిచెడ్‌లో ఏప్రిల్ మాసంలో యువకులు జమిచెడ్ స్టేజీ వద్ద ఉన్న స్ట్రీట్ లైట్ స్తంభానికి పెద్ద ఎత్తున్న ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కొందరు ఈ ఫ్లెక్సీపై రాసిన వ్యాకం, జెండాను తొలగించాలని విముఖత తెలిపారు. మరో వర్గం వారు అదే స్తంభానికి జెండా, ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో స్తంభానికి రెండు జెండాలు ఉన్నాయి. బుధవారం అర్ధారాత్రి కొందరు ఒక జెండాను తొలగించారు. దీంతో ఇరువర్గాల వారికి త్రీవ స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ విషయం రూరల్ పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు. స్తంభంపై ఉన్న జెండాలను, ఫ్లెక్సీల ను తొలగించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కలిసి మెలిసి ఉండాలని ఎస్ఐ వారిని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్లె ప్రజలకు ఆయుష్మాన్ సేవలు

- ఆరోగ్య ఉపకేంద్రాల్లో 12 రకాల వైద్య చికిత్సలు
- అలంపూర్ డివిజన్‌లో 50 ఉపకేంద్రాలు
- మొదలైన ఆయుష్మాన్ వైద్య సేవలు



తక్కశిల ఉపకేంద్రంలో పలు రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఉండవెల్లి: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ వైద్య సేవలు ప్రజలదరిచేరనున్నాయి. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆయుష్మాన్ మందిర్ పేరుతో ఈ వైద్య సేవలు అందించనున్నారు. పల్లెలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

50 ఉపకేంద్రాల్లో..

అలంపూర్ డివిజన్‌లో 50 ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలు అందిస్తారు. ఈ మేరకు అధికారులు కేంద్రాల్లో పనిచేసే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామీణులకు మెరుగైన, నాణ్యమైన చికిత్స అందించాలన్న లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ 12 రకాల వైద్య సేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని కేంద్రాల్లో దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి జిల్లా ఆస్పత్రిలో పనిచేసే ప్రత్యేక వైద్య నిపుణలతో ఉపకేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. వారానికి ఒక రోజు ఉపకేంద్రాల్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారు. ఉప కేంద్రాల్లో రోగి సమస్య తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రి లేదా ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తారు.

ఆరోగ్య సేవలివే..

గర్భిణి ప్రసూతి సేవలు, నవజాత శిశువు, శిశువు ఆరోగ్య సేవలు, బాల్యం, కిశోర శిశు ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి, ఆరోగ్య సేవలు, సంక్రమిత వ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ రుగ్మతలకు ఔట్ పెషంట్ సేవలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ, ఉపశమనం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సాధారణ కంటి(ఈఎస్‌టీ) సేవలు, సాధారణ నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్య సేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్ నిర్వహణ సేవలు అందుబాటులో ఉన్నాయి.

కొన్ని కేంద్రాల్లో దంత సేవలు, పలు వైద్య సేవలకు మందులు కరువు..

ఉప కేంద్రాల్లో వారానికి ఒక్కసారి వచ్చే వైద్యుని కోసం ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 104 సేవలు వస్తున్న తరుణంలో ఎలాంటి మందులైన సకాలంలో అందుంతుడేవి. కొన్ని వైద్య సేవలకు కర్నూల్ వెళ్లాల్సి వచ్చేది. ఉపకేంద్రాలలో ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బందిని కొన్ని చోట్ల మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రజలు అన్ని రోజులలో అందుబాటులో ఉండాలని ఆయుష్మాన్ సేవలు అందిస్తున్న తరుణంలో అధికారులే చూసి చూడనట్లు వారికి సూచనలు ఇచ్చి వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. వైద్య కేంద్రాలలో అందరికి అందుబాటులో వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దంత వైద్య సేవలు ఎక్కడ నిర్వహించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రత్యేక శిబిరాల ద్వారా వైద్య సేవలు

ఆయుష్మాన్ వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఆరోగ్య ఉప కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలను ప్రత్యేక శిబిరాల ద్వారా అందిస్తాం. వ్యాధి తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రికి రోగులను తరలిస్తారు. ఇప్పటికే దంతవైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

– ఇర్షాద్, జిల్లా వైద్య ప్రోగ్రామింగ్ అధికారి



బొంకూరులో ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రం

యువకుడి కాలు తొడలో గుచ్చుకున్న చెట్టుకొమ్మ



యువకుడి తోడలో ఇరుకున్న చెట్టు కొమ్మ

మానవపాడు: ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన యువకుడి కాలు తొడ భాగంలో చెట్టుకొమ్మ గుచ్చుకోవడంతో నరకయాతన అనుభవించాడు. స్థానికుల కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని మద్దూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మాలిక్ తుంగభద్ర నది నుంచి అనుమతితో ఇసుకను మద్దూరు నుంచి గద్వాలకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో అమరవాయి శివారు ప్రాంతంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో యువకుడి తొడభాగంలో చెట్టుకొమ్మ ఇరుక్కొని ట్రాక్టర్‌లోనే ఇబ్బందులు పడుతూ కేకేలు వేశాడు. గమనించిన స్థానికులు వెంటనే ట్రాక్టర్‌లో ఇరుకున్న మాలిక్‌ను తప్పించి రోడ్డుపై కూర్చోబెట్టారు. వెంటనే ఘటన స్థలానికి ఎస్ఐ చంద్రకాంత్ చేరుకున్నారు. తొడభాగంలో ఇరుక్కున్న కొమ్మను రంపంతో తొలగించారు. సగం చెట్టు కొమ్మ యువకుడి తొడలోనే ఉండటంతో వెంటనే మానవపాడు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కొమ్మను తొలగించేందుకు ఆపరేషన్ చేయనున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు.